నగరమంతా మంగళవారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షానికి సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలు అతలాకుతలమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు ఇళ్లలోకి చేరడంతో నానా ఇబ్బందులకు గురయ్యారు. పలు ఇళ్లలోని సామగ్రి అంతా నీటిలో కొట్టుకుపోయింది. రోడ్లన్నీ నదులను తలపించాయి. వివిధ పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారు నానా ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించి బాధితులకు భరోసా కల్పించారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


సుభాష్‌నగర్‌లో ముంపునకు గురైన ఇళ్లు

వర్షం.. జలదిగ్బంధం

నేలకొరిగిన చెట్లు, కూలిన పురాతన ఇళ్లు | భారీగా పారిన వరద | లోతట్టు ప్రాంతాలు జలమయం

- బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పద్మారావునగర్ పార్కు పక్కన రోడ్డులో పెద్ద ఎత్తున వరదనీరు నిల్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పద్మారావునగర్‌లో శ్మశానవాటిక ప్రహరీ కూలిపోయింది. రహదారి పక్కనే గోడ నెలకూలడంతో గోడ సమీపంలో పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.
- అమీర్‌పేట డివిజన్‌లోని రిలయన్స్ గల్లీ,గంగుబాయి బస్తీ, బొద్దనగర్,శ్రీరాంనగర్, గాయత్రినగర్‌లో రోడ్లపై పెద్ద ఎత్తున నిలిచింది. గాయత్రినగర్‌లోకి వర్షం నీటితో పాటు మట్టి, వ్యర్థాలు రావడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు.
- తార్నాక డివిజన్‌లోని లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ బస్తీలోని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఇంటి ముందు పార్కు చేసిన వాహనాలు వరద నీటిలో మునిగిపోయాయి. రోడ్లపై ట్రాఫిక్ జాంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.
- సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పరిబస్తీలో భారీ వృక్షం కూకటివేళ్లతో నేలకూలింది
- బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాలైన మయూరిమార్గ్, అల్లంతోటబావి, చీకోటి గార్డెన్స్, బ్రాహ్మణవాడీ, వడ్డెరబస్తీ ప్రాంతాలు నీటమునిగాయి. బేగంపేట పీఎన్‌టీ ఫ్లైఓవర్, ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ల వద్ద భారీగా చేరిన వరదతో ట్రాఫిక్ స్తంభించింది.
- రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలు బస్తీలు నీట మునిగాయి. మెక్లోడ్‌గూడ, నల్లగుట్టలో బస్తీల్లోకి భారీగా నీళ్లు చేరడంతో స్థానికులు ఇక్కట్లకు గురయ్యారు.


పద్మారావునగర్‌లో కూలిన శ్మశానవాటిక ప్రహరీ




లాలాపేటలో..


మెక్లోడ్‌గూడలో..


బేగంపేట వడ్డెరబస్తీలో..


జలమయమైన బేగంపేట అల్లంతోటబావి

ప్రజా ప్రతినిధుల పర్యటన

కంటోన్మెంట్ పరిధిలో నీటి మునిగిన ప్రాంతాల్లో మంత్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్ లాస్య నందిత. శ్రీనివాస్ శ్రీ గణేష్ పిడమర్తి రవి, శాంసన్ రాజు పర్యటించి స్థానికులకు భరోసా కల్పించారు. బేగంపేట ప్రధాన రహదారిలో నిలిచిన వరదనీటి తొలగింపు పనులను కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి పర్యవేక్షించారు. వడ్డెర బస్తీలో మంత్రి ఆదిత్యరెడ్డి పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలాయి. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత సిబ్బందితో రోడ్డుకు అడ్డంగా పడిని వృక్షాలను తొలగింజేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్లపై నిలిచిన నీటిని తొలగించడంతో రాకపోకలు సాఫీగా సాగాయి.

'కంటోన్మెంట్ పట్ల ప్రభుత్వం వివక్ష'

కంటోన్మెంట్: నగరంలోనే ఏకైక ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం పట్ల ప్రభుత్వ పెద్దలు వివక్ష చూపుతున్నారని బోర్డు సభ్యుడు రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఆయన బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుడులు, బడులు, డబుల్ బెడ్‌రూమ్‌ల కేటాయింపులు చివరికి శ్మశానాల అభివృద్ధి విషయంలోనూ కంటోన్మెంట్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని విమర్శించారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందంటూ మంత్రి తలసాని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కంటోన్మెంట్‌ను ఆనుకుని ఉన్న సనత్‌నగర్, సికింద్రాబాద్ నుంచి ప్రాతినిథ్యం వహించే పెద్దలు ఇక్కడికి రావాల్సిన నిధులను సైతం మళ్లించుకుంటూ మళ్లీ లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

తల్లి మృతి తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: తల్లి మృతిని తట్టుకోలేక మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. బల్కంపేట బీజేఆర్‌నగర్‌లో ఉండే శ్రీశైలం (43)కు 2013లో ఓ మహిళతో వివాహం జరిగింది. కొంత కాలానికే భార్యతో విడాకులయ్యాయి. అప్పటి నుండి తల్లి భారతమ్మతో కలిసి ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం భారతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి శ్రీశైలం మనస్తాపానికి గురవుతూ ఇంట్లో ఒక్కటే ఉంటున్న శ్రీశైలంను సోదరి అనిత తన ఇంట్లో పెట్టుకుంది. బీజేఆర్‌నగర్ ఉన్న ఇంటిని అద్దెకిచ్చి, ఇంట్లో ఉన్న అమ్మ ఫొటోకు దండం పెట్టుకుని వస్తానని సోదరితో చెప్పి వెళ్లి ఎంతకీ రాకపోవడంతో ఫోన్ చేసినా ఎత్తలేదు. పక్కింటి వారికి వెళ్లి చూడాలని చెప్పడంతో తలుపులు తీసేందుకు ప్రయత్నించగా లోపలి నుంచి గడియ వేసి ఉండడంతో విరగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గురువులకు వందనం

సికింద్రాబాద్ /రాంగోపాల్‌పేట్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలోని అమరావతి విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు వట్టిపల్లి కోటేశ్వర్ రెడ్డి విగ్రహానికి ఆ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్స్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా హిల్ స్ట్రీట్ పాఠశాలలో అల్లాడి గౌరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో..

గాంధీఆస్పత్రి : గాంధీ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ విభాగ హెచ్ఓడీ కృపాల్‌సింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు తమకు వైద్యవిద్యను బోధిస్తున్న ఉపాధ్యాయ వైద్యులను శాలువా కప్పి సత్కరించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులు లావణ్య, వెంకటనాగరాజు లతోపాటు పలువురు పీజీలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సనత్‌నగర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో బీకేగూడ జైభారతి హైస్కూల్ కరస్పాండెంట్ విష్ణుకుమార్, స్నేహలతలను శాలువాతో సత్కరించారు.


కోటేశ్వర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

వినతి

లాలాపేట: వీరశైవ లింగాయత్, లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చే విషయంపై ఢిల్లీలో నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ గంగారం ఆహిర్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈశ్వరప్ప పాల్గొని చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు

నేడు కృష్ణాష్టమి వేడుకలు

సికింద్రాబాద్: త్రీస్టార్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతాఫల్‌మండిలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చెన్నయ్యగౌడ్, అధ్యక్షుడు బొగ్గుల కృష్ణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గత 41 ఏళ్ల నుంచి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహం వద్ద ఈ నెల 10 తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు జరుగుతాయన్నారు.

హనుమాన్ దేవస్థానంలో..

సనత్‌నగర్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం, అర్చన, సాయంత్రం 6 గం. నుంచి స్వామివారి పూజ, ఉయ్యాలసేవ, ఉట్టి కొట్టే కార్యక్రమం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

జమిలి ఎన్నికల విధానం ఉత్తమం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచంలో అత్యధిక జనాభా గల మన దేశానికి జమిలి ఎన్నికల విధానం ఉత్తమమని తెలంగాణ బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ మాజీ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఒకేసారి ఎన్నికలను నిర్వహించడంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని తద్వారా ప్రభుత్వం ప్రజలకు మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు.

ప్రకృతి సేవా సంస్థ సేవలు అభినందనీయం

సనత్‌నగర్: గత పదేళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్న ప్రకృతి సేవా సంస్థ చైర్మన్ ఆరెపల్లి రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు కందుకూరి వెంకటస్వామి సేవలను టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రశంసించారు. గణేష్ చవితి రానున్న దృష్ట్యా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ నేపథ్యంలో సభ్య కార్యదర్శిని మంగళవారం కలిసిన ఇరువురు తమ సంస్థ చేస్తున్న కార్యకలాపాల గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ప్రకృతి సేవా సంస్థ సేవలను కృష్ణ ఆదిత్య కొనియాడారు. ప్రసన్నకుమార్, సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, సత్తయ్య పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో ఈ నెల 1న ప్రారంభమైన నాభిశిల(బొడ్రాయి) పునఃప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. గత ఐదు రోజుల పాటు పూజలు, క్షీరాభిషేకాలు, బైండ్ల కథ, బలి, గావు, బోనాల జాతర వంటి కార్యక్రమాలతో లాలాపేట ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.ముగింపు వేడుకల్లో మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, నాయకులు బండ చంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. శితలాదేవి అమ్మవారి అనుగ్రహంతో లాలాపేట ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు కలుగాలని ఆకాంక్షించారు. దాదాపు వందేళ్ల తర్వాత లాలాపేట బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలను ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.

ఏబీవీపీ దాడికి ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని ఓ ప్రవేటు కాలేజీపై ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు దాడిని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు చటారి దశరథ్ మంగళవారం తీవ్రంగా ఖండించారు. కాలేజీ పై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, సిబ్బందిని కొట్టడం దారుణమన్నారు. కేవలం వారి ఉనికి కోసం దాడి చేశారు తప్ప సమస్యల పరిష్కారం కోసం కాదన్నారు. ఎంతో భవిష్యత్ గల విద్యార్థులను ఏబీవీపీ నాయకత్వం దాడులు చేసే గుండాలుగా తయారు చేస్తున్నారని దశరథ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగ విద్యార్థులే కీలకం

బౌద్ధనగర్: ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణ సాధనలో మాదిగ విద్యార్థులు ప్రధాన పాత్ర పోషిస్తారని ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అనుముల నర్సయ్య మాదిగ పేర్కొన్నారు. మంగళవారం పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి సుధాకర్ మాదిగ పాల్గొ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కోసం జరిగే అంతిమ పోరాటంలో మాదిగ విద్యార్థులు ఇది తమ కర్తవ్యంగా భావించి జాతి అభివృద్ధి కోసం పోరాటం చేయాలన్నారు.

వృద్ధుడి అదృశ్యం

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పార్శీగుట్ట సంజీవపురానికి చెందిన శంకరయ్య (75) గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వాళ్లు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు శ్రీనివాస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


శంకరయ్య

7న క్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ న్యూబోయిగూడలోని ముదిరాజ్ సంఘంలో ఈ నెల 7వ తేదీ గురువారం నగర మాజీ మేయర్, సంఘ సంస్కర్త క్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం బోయిగూడ ముదిరాజ్ సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు రాజాపతి, సదానంద్, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆంజనేయులు, సురేందర్, వెంకటేష్, శారద మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో క్రిష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు పుస్తకాలు, మహిళలకు చీరలను పంపిణీ చేస్తామన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పలువురికి మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులు ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారు తమ పరిసరాల్లోని ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు ఎస్.శేషుకుమారి, ఆకుల రూప, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, ఆంజనేయులు, కూతురు నర్సింహ్మా, నారాయణరాజు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న మంత్రి